

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

## పెండింగ్ ప్రాజెక్టులపై డిసెంబర్ 7న దీక్ష

### మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 3 : పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. పాలమురు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని మూడో ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, లేకుంటే డిసెంబర్ 7న నిరసన దీక్ష చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ఆదివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా.. అసమర్థ పాలనతో అభివృద్ధి శూన్యంగా మారిందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో భరోసాయాత్ర చేపడుతానని పేర్కొన్నారు. పాలకులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయాలని మంత్రులు చెబితే.. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. పీఆర్‌ఎల్‌ఐలో నీట మునిగిన మోటర్లను ఎందుకు పట్టించుకోవడం లేదని.., బురదలో ఇరుక్కున్న మోటర్లను నీటితో కడిగారే తప్పా మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు.

## బుల్‌డోజర్లకు అడ్డుగా నిలబడతాం

- అన్ని పార్టీలు, ప్రజలను కలుపుకొని పోరాడుతాం
- మూసీ పరివాహక కాలనీల ప్రజలతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మూసీ పరివాహక కాలనీల సమావేశంలో మాట్లా డుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 3: మూసీ నది పరివాహక ప్రాంతంలో ఇండ్లను కూల్చడానికి వచ్చే బుల్‌డోజర్లకు అడ్డుగా నిలబడతామని, పేద ప్రజలను అన్యాయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని చైతన్యపురి డివిజన్ ద్వారకాపురం కాలనీలో మూసీ పరివాహక కాలనీలు, బస్తీల ప్రజలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకా రం కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం తమ ఇండ్లను ఎప్పు డు కూలుస్తుందోనన్న భయంతో పేద ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు ఎలాంటి మార్కింగ్‌లు వేసినా ప్రజలకు నష్టం జరుగనివ్వబోమని ధైర్యం చెప్పారు. మూసీ ప్రజల శ్రేయస్సు కోసం, వారికి అండగా నిలిచేందుకు అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్ యాదవ్ తదితరులతోపాటు పలు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నిప్పు.. టచ్ చేయలేరు

## 24 గంటల కరెంటు ఇచ్చినందుకు జైలులో పెడతారా?

- విద్యుత్తు సంఘం చైర్మన్ జస్టిస్ మదన్ బీ లోకూర్ ఎప్పుడు పనిచేశారో మాకు తెలియదు
- వివరణ తీసుకోలే, విచారణ జరపలే
- బీఆర్‌ఎస్‌పై విషం కక్కుతున్న కొన్ని మీడియా సంస్థలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి తిథి పెట్టేందుకు ప్రజలు సిద్ధం
- అసదుద్దీన్ గురించి మాట్లాడి వేస్ట్
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం



ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్నమాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులాంటి వ్యక్తి అని, పాలనచేతకాని ఈ మరుగుజ్జులు ఆయన దగ్గరకు కూడా చేరలేరని, మాడిమసైపోతారని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 24 గంటల కరెంటు ఇచ్చినందుకు కేసీఆర్‌ను జైల్లో పెడతారా? అని ప్రశ్నించారు. విద్యుత్తు సంఘం నివేదికలో ఏమున్నదని దొంగతనంగా ముందే లీకులు ఇస్తున్నారని నిలదీశారు. విద్యుత్తు సంఘం చైర్మన్ మదన్ బీ లోకూర్ ఎప్పుడు పనిచేశారో తెలియదని, తమ వివరణను చైర్మన్ తీసుకోలేదని, విచారణ చేయకుండా నివేదిక ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కొన్ని మీడియా సంస్థలు తమపై విషం కక్కుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ ఆరోపణలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కమిషన్ విచారణ పూర్తిచేసి నివేదిక ఇచ్చినట్టు ప్రభుత్వంగానీ, ముఖ్యమంత్రిగానీ, సీఎస్‌గానీ ఎక్కడా అధికారంగా చెప్పలేదని అన్నారు. విద్యుత్తు కమిషన్ వేస్తున్నట్టు సీఎం అసెంబ్లీలో ప్రకటించారని, విచారణ పూర్తయితే అసెంబ్లీలోనే వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ముందు చిల్లర వేషాలు వేయలేరని విమర్శించారు. 'దొంగతనంగా లీకులు ఎందుకు ఇస్తున్నారు. మమ్మల్ని జైలులో వేసే ఆలోచన వస్తే ఆలస్యం ఎందుకు.. భయపడుతున్నారా?' అని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్తు ఒప్పందాలపై విచారణ సంఘం తొలి చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి ఎలాంటి విచారణ జరపకుండానే కేసీఆర్‌పై మీడియా ముఖంగా ఆరోపణలు చేయడంతో తాము సుప్రీంకోర్టుకు వెళ్లామని గుర్తుచేశారు. జస్టిస్ నరసింహారెడ్డిని మార్చాలని ధర్మాసనం తీర్పు ఇచ్చిందని, నూతన చైర్మన్‌గా నియమితులైన జస్టిస్ మదన్ బీ లోకూర్ ఎప్పుడు విచారణ చేశారో కూడా తమకు తెలియదని అన్నారు. కమిషన్ నివేదిక ఇచ్చినట్టు అనుకూల మీడియాకు ప్రభుత్వం లీకులు ఇవ్వడం ఏమిటని నిలదీశారు. విద్యుత్తు సంఘం రిపోర్ట్ ఇస్తే బాజాప్తా ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. చిల్లరమల్లర రాజకీయాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

### ఏం చేశారని ఏడాది సంబురాలు?

కాంగ్రెస్ ఏడాది పాలనపై సంబురాలు జరుపుతామని, వేడుకలకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని ఆహ్వానిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. ఏం చేశారని ఏడాది సంబురాలు? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పాలనపై సర్టిఫికెట్ ఇవ్వాల్సింది ప్రజలని అన్నారు. రాహుల్‌గాంధీకి దమ్ముంటే పోలీసులు లేకుండా అశోక్‌నగర్‌కు, రైతుల వద్దకు రావాలని సవాల్ విసిరారు. అప్పుడు ప్రజలు ఏడాది సంబురాలు జరుపుకొంటారో? ప్రభుత్వానికి ఏడాది తిథి (మాసికం) పెడతారో తెలుస్తుందని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలు తిథి పెట్టడానికి రెడీగా ఉన్నారని హెచ్చరించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, చివరికి రక్షణ కల్పించే పోలీసులకు ఇచ్చిన హామీలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం కుదేలైందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం 4 వేల కోట్లు తగ్గిందని, అవినీతితో కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారని విమర్శించారు. పోలీసులను చూసి ప్రభుత్వం భయపడే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గమైనా సంతోషంగా ఉన్నదని చెప్పే ధైర్యం రేవంత్‌కు ఉన్నదా? అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను కొన్ని మీడియా సంస్థలు చూపించకపోవడంతో రేవంత్‌రెడ్డి తప్పులను ప్రజా గొంతుకగా సోషల్ మీడియా ఎత్తిచూపుతున్నదని పేర్కొన్నారు. వారి గొంతు నొక్కాలని చూస్తున్నారని, అరెస్టులతో ఆందోళనలను ఉద్యమాలను ఆపలేరని తేల్చి చెప్పారు. రేవంత్‌రెడ్డికి 'ముందుంది ముసళ్ల పండగ' అని హెచ్చరించారు. ధాన్యం ప్రభుత్వానికి ఇస్తే డబ్బులు వస్తాయో రావో అని రైతులు భయపడుతున్నారని అన్నారు. ఢిల్లీకి మూటలు పంపడంలో, ప్రజాధనం దోచుకోవడంలో రేవంత్‌రెడ్డి, మంత్రులు పోటీ పడుతున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్‌పై ఐఎంఐ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యపై జగదీశ్‌రెడ్డి స్పందించారు. ఒవైసీ గురించి ముస్లింలకు తెలుసని పేర్కొన్నారు. ఆయన గురించి మాట్లాడటం వృథా అని అన్నారు. మూసీ పునరుజ్జీవానికి బీజం వేసిందే బీఆర్‌ఎస్ అని గుర్తుచేశారు.

### రైతులను గాలికొదిలేసి ఇతర రాష్ట్రాల్లో జల్సాలు

ధాన్యం, పత్తి కొనుగోళ్లు చేపట్టకుండా రైతులను గాలికొదిలేసి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో ఎంజాయ్ చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కొనుగోళ్లపై సమీక్ష చేయని వీరంతా పక్క రాష్ట్రాల్లో మాత్రం ఎన్నికల ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 'కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేవు. ధాన్యం కొనే దిక్కు లేదు. మిల్లర్లతో చర్చలు జరపలేదు. ఏ కేంద్రంలో కొన్న వడ్లు ఏ మిల్లుకు వెళ్లాలో నిర్ణయించలేదు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి కల్లాల్లో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నరు. పత్తి రైతులకు కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయి. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చిందే గ్రామీణ ప్రాంతాలు. 2014కు ముందున్న పరిస్థితులు తెలంగాణలో దాపురించాయి. మోదీని రేవంత్‌రెడ్డి తిట్టినా బీజేపీ నేతలు సైలెంట్‌గా ఉన్నారు. రేవంత్‌రెడ్డిని విమర్శించే మొగోడు బీజేపీలో లేడు. రెండు పార్టీల నేతలు అంతగా హత్తుకుపోయారు' అని మండిపడ్డారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లను త్వరితగతిన కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## కులగణనను కుట్రగా మార్చొద్దు

- సర్వే చేసేది కాంగ్రెస్ పార్టీయా, ప్రభుత్వమా?
- స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన సర్వేను కుట్రగా మార్చేస్తున్నదని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సర్వే వెనుక సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రయోజనాలు కనిపిస్తున్నాయని, బీసీలకు ఎలాంటి మేలు కలిగేలా కనిపించడం లేదని అనుమానం వ్యక్తంచేశారు. ప్రభుత్వం శాస్త్రీయ సర్వేకు మార్గం చూపకుండా, ప్రభుత్వమే గందరగోళం సృష్టిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేను కావాలనే న్యాయపర సమస్యల్లోకి నెట్టేలా చూస్తున్నదని ఆరోపించారు. సర్వే ప్రక్రియలో కాంగ్రెస్ జోక్యం దేనికో సమని విమర్శించారు. అసలు ఈ సర్వే చేస్తున్నది ప్రభుత్వమా, కాంగ్రెస్ పార్టీయా? అని ప్రశ్నించారు. సర్కార్ కసరత్తును కాంగ్రెస్ సర్కస్‌గా నిర్వహించాలనుకోవడం దారుణమని పేర్కొన్నారు. హస్తం పార్టీ నేతల జోక్యం వల్ల గ్రామాల్లో సర్వే ప్రభావితమై, సామాజిక వర్గాల లెక్కలు తలకిందులయ్యే ప్రమాదమున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన కోసం ఈ నెల 5న వివిధ వర్గాలతో సమావేశం కావడానికి రాహుల్ గాంధీ ఎవరని, రాష్ట్ర ప్రభుత్వంలో ఆయనకున్న బాధ్యతలు ఏమిటని ప్రశ్నించారు. ఇదే పద్ధతిలో ప్రభుత్వం కులాలు, కుటుంబాల వివరాలు సేకరిస్తే, బీసీలకు తీరని ద్రోహం జరగడం ఖాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోర్టు తీర్పులను, విపక్షాల సూచనలను గమనంలోకి తీసుకొని సర్వేను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## డెడికేటెడ్ కమిషన్ వేయక తప్పదు!

- ఈ సోయి ముందే ఉంటే బాగుండేది
- బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఫైర్



హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కులగణన నిలబడాలంటే డెడికేటెడ్ కమిషన్ వేయక తప్పదని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. ఆలస్యంగానైనా కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని.. ఇది మంచి నిర్ణయమని, ఈ సోయి ముందే ఉంటే బాగుండేదని రేవంత్ సర్కారుకు ఆదివారం ఎక్స్ వేదికగా చురకలంటించారు. 'స్పష్టమైన చట్టాలు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాక కూడా దుందుడుకు, డొంక తిరుగుడు నిర్ణయాలేందుకు? కోర్టు తీర్పులు, ప్రజల ఒత్తిడి ఉంటేనే రాజ్యాంగబద్ధమైన నిర్ణయం తీసుకుంటారా? అని ప్రశ్నించారు. ఇదే పద్ధతిలో జీవో 46, జీవో 29 విషయంలో ప్రభుత్వం భేషజాలకు పోకుండా, చేసిన తప్పిదాలను సరిదిద్ది, నిరుద్యోగులను ఆదుకోవాలని హితవు పలికారు. హైడ్రా, మూసీ ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, ఉపాధి కల్పించి ప్రభుత్వం తన రాజ్యాంగ నిబద్ధతను చాటుకోవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డికి దాసోజు సూచించారు.

### ఇది బీఆర్‌ఎస్ విజయం: కిశోర్‌గౌడ్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం.. బీఆర్‌ఎస్ విజయమని ఆ పార్టీ నేత, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం తన తప్పును సరిదిద్దుకొని ఈ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నానమని తెలిపారు. కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేలా ఇప్పటికైనా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. లేనిపక్షంలో ప్రభుత్వ తప్పులను బీఆర్‌ఎస్ ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ, రిజర్వేషన్లు అమలయ్యే వరకు బీసీల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# డెడికేటెడ్ కమిషన్‌కు గ్రీన్‌సిగ్నల్

మొదటిపేజీ తరువాయి...



ఉంటుంది. ఆ కమిషనే గ్రామస్థాయి వరకు ఆయా వర్గాల రాజకీయ వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసి, రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాల్సి ఉంటుంది. ఇది సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పు. ఈ తీర్పు ప్రకారమే దేశంలోని అన్ని రాష్ట్రాలు బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాలని చాలా స్పష్టంగా నొక్కిచెప్పింది. ఆ తీర్పును ఉల్లంఘించిన వివిధ రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడంతోపాటు, ఆయా రాష్ట్రాల నిర్ణయాలను కొట్టివేసింది. అయినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగింది. డెడికేటెడ్ కమిషన్ బాధ్యతలను కూడా రాష్ట్ర బీసీ కమిషన్‌కే అప్పగిస్తూ జీవో 47ను జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ వివిధ బీసీ సంఘాలు ఇటీవల హైకోర్టును ఆశ్రయించాయి. ప్రభుత్వ ఆదేశాలతో మొత్తంగా స్థానిక సంస్థల్లోనే బీసీలకు రిజర్వేషన్లు లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తంచేశాయి. వెంటనే రాజ్యాంగ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలను జారీ చేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశాయి. పిటిషనర్ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు జస్టిస్ ఎస్ నంద ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. బీసీ కమిషన్‌కే డెడికేటెడ్ కమిషన్‌గా అధికారాలు కల్పించామన్న అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలను తోసిపుచ్చారు. బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సిందేనని, సుప్రీం మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. ఆ మేరకు తెలంగాణలో కూడా ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని, రెండు వారాల్లో నివేదికను న్యాయస్థానానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో నొక్కిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎట్టకేలకు కండ్లు తెరిచి డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

### హైకోర్టు తీర్పుపై సీఎం సమీక్ష

జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన, రిజర్వేషన్ల స్థిరీకరణ అంశంపై ఆదివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. హైకోర్టు తీర్పుపైనా కూలంకషంగా చర్చించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలపైనా సమీక్షించారు. తుదకు చేసేదేమీ లేదని, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయక తప్పదని నిర్ణయానికి వచ్చినట్టు స్పష్టమవుతున్నది.

#### బీసీ మంత్రులు లేకుండానే సమీక్ష

బీసీ కులగణన, డెడికేటెడ్ కమిషన్ అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో సంబంధిత బీసీ సంక్షేమశాఖ మంత్రే కాదు, ఇతర బీసీ మంత్రులెవరూ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు, న్యాయనిపుణులు పాల్గొన్నారు. బీసీ ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నేతలు కూడా లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం ఆది నుంచీ ఇదే తరహాలో ఒంటెత్తు పోకడలతో ముందుకు పోతున్నదని, ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందని, అయినా తీరు మారలేదని బీసీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయకతప్పదని 'నమస్తే తెలంగాణ' ఆది నుంచి చాలా స్పష్టంగా చెబుతూనే ఉన్నది. అందుకు సంబంధించి అనేక కథనాలను ప్రచురించింది. తుదకు అందుకు అనుగుణంగానే హైకోర్టు ఉత్తర్వులు రావడం, ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

#### బీసీ కమిషన్ బహిరంగ విచారణ వాయిదా

రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బీసీ కమిషన్ వరుసగా నిర్వహిస్తున్న బహిరంగ విచారణను అనివార్య కారణాల దృష్ట్యా వాయిదా వేసినట్టు కమిషన్ చైర్మన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన షెడ్యూల్‌ను విడిగా జారీ చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



మాదిగల ధర్మయుద్ధ మహాసభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

## వర్గీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకం


- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు వేరు.. చేతలు వేరు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కామారెడ్డి, నవంబర్ 3: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు వేరు, చేతలు వేరుగా ఉన్నాయని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే.. దేశంలో వర్గీకరణను తానే మొదట అమలు చేస్తానని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి ఆపై మాట తప్పారని విమర్శించారు. వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీకి రేవంత్ సర్కార్ సిద్ధపడుతున్నందుకు నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో మాదిగల ధర్మయుద్ధం మహాసభ నిర్వహించారు. ఈ మందకృష్ణ మాట్లాడుతూ.. మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు నియోజకవర్గాల్లో తిరుగుతూ ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వారిని ప్రోత్సహిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసినప్పుడు మాదిగలు అండగా నిలిచారని, నీతి, నిజాయితీ ఉంటే మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2004లో ఎస్సీ వర్గీకరణను 24 గంటల్లో రద్దు చేసింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా అమలుచేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని మండిపడ్డారు.

# పోరుబాటలో సకల జనులు

పదకొండు నెలల కాంగ్రెస్ సర్కారుపై ప్రజాగ్రహం ఎగిసిపడుతున్నది. దగా పడ్డామంటూ సబ్బండవర్గాలూ పోరు సలుపుతున్నాయి. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో మూలన ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు వెల్లువెత్తుతున్నాయి.

- ధర్నాలతో దద్దరిల్లుతున్న రాష్ట్రం
- గిట్టుబాటు ధర, రైతు భరోసా కోసం అన్నదాతల పోరు
- వసతులు, చదువులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థుల ధర్నా
- కొలువుల కోసం నిరుద్యోగులు.. రక్షణ కోసం జర్నలిస్టులు
- వెట్టిచాకిరి తప్పించాలని పోలీసులు, హోంగార్డులు
- నీళ్ల కోసం మహిళల నిరసనలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్కేకాలనీలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు (ఫైల్)

హైదరాబాద్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): రాష్ట్రం ధర్నాలతో దద్దరిల్లుతున్నది. తెలంగాణ సమాజంలోని ఏ వర్గాన్ని తట్టినా నిరసన జ్వాలలే ఎగిసిపడుతున్నాయి. 11 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అట్టుడుకుతున్నది. పదేండ్లపాటు కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న సబ్బండవర్గాలు.. ఇప్పుడు రోడ్లెక్కి నిరసనలు తెలిపే దుస్థితికి వచ్చాయి. ప్రస్తుత తెలంగాణలో ఉద్యమకాలం నాటి పరిస్థితులు మళ్లీ దాపురించాయని రాజకీయ విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. పాలన, ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వాధినేతలు.. విమానాల్లో చక్కర్లు కొడుతుంటే.. సమస్యల పరిష్కారానికి ప్రజలు రోడ్లమీదకు వస్తున్నారని పేర్కొంటున్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, పోలీసులు, హోంగార్డులు, జర్నలిస్టులు, ఆఖరికి 'తాగునీళ్లు లేవు మొర్రో' అంటూ ఆడబిడ్డలు కూడా ఆందోళనలకు దిగుతున్న దుస్థితి ఈ 11 నెలల్లోనే కనిపించిందని విమర్శిస్తున్నారు.

### రైతు గోస పట్టని ప్రభుత్వం..

'అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం' అని రైతు భరోసాపై ఊరించి ఉసూరుమనిపించారు. చివరికి ఈ ఏడాదికి ఇవ్వలేమని చేతులెత్తేశారు. రైతు భరోసా కోసం ఆగ్రహంతో అన్నదాతలు రోడ్లపైకి వస్తున్నారు. ఇప్పటికీ రుణమాఫీ కాని రైతులు ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా పూర్తిస్థాయి అమలు కోసం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కోరుట్ల నుంచి జగిత్యాల వరకూ ఈ నెల 12న పాదయాత్ర చేసేందుకు సన్నద్ధమయ్యారు. మరోవైపు ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో అకాల వర్షాలతో కల్లాల్లో తడిసిన వడ్లను చూసి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. తడిసిన ధాన్యాన్ని రోడ్లకి తీసుకొచ్చిన వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. ఇక పత్తి రైతులు గిట్టుబాటు ధర కోసం మార్కెట్ యార్డులు, రోడ్లపై ఆందోళన చేపడుతున్నారు. మరికొందరు కాలుష్య కారక కంపెనీల కోసం తమ భూములు గుంజుకోవద్దని భారీస్థాయిలో నిరసన తెలుపుతున్నారు.

### న్యాయం కోసం రక్షకభటులూ..

పదేండ్లపాటు రాష్ట్రానికి రక్షణ కవచంలా ఉన్న పోలీసులు సైతం ప్రభుత్వ పెద్దల వింత నిర్ణయాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన 15రోజుల పనివిధానానికి స్వస్తి పలికి 26రోజుల విధానాన్ని తీసుకురావటంతో బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి భార్యలు సచివాలయం వరకూ వచ్చి ఆందోళనలు చేపట్టారు. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని ధర్నా చేశారు. వీరిపై ప్రభుత్వం సస్పెన్షన్ల వేటు వేయడంతో ఆందోళనల పంథా మార్చారు. మరోవైపు ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని హోంగార్డులు పోరుబాట పట్టారు. వారిని ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో మెరుపు ధర్నా చేపట్టారు. ఇక పెండింగ్ డీఏలు, సరెండర్ల విషయంలో సివిల్, ఏఆర్ పోలీసుల్లో వస్తున్న వ్యతిరేకతను ముందే గుర్తించి.. కొన్ని సరెండర్లకు నిధులు విడుదల చేసింది ప్రభుత్వం.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ 6వ బెటాలియన్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు (ఫైల్)

### వెల్లువెత్తున్న ఆగ్రహం..

బీఆర్‌ఎస్ హయాంలో గురుకుల విద్యార్థులను కంటికి రెప్పల కేసీఆర్ కాపాడుకోగా.. ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ మాత్రం వారికి కనీస వసతులు కల్పించడంలో విఫలమైంది. తిండి సరిగా పెట్టడం లేదంటూ విద్యార్థులు భోజనం ప్లేట్లతో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. గురుకుల భవనాలకు అద్దె చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు. 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఎక్కడ? అంటూ నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. నిష్పక్షపాతంగా పరీక్షలు నిర్వహించాలంటూ చౌరస్తాల్లో ధర్నాలకు దిగుతున్నారు. మరోవైపు నిజాలు నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టులను సైతం కొందరు ప్రభుత్వ పెద్దలు వేధింపులకు గురిచేస్తూ కేసులు పెడతామని బెదిరిస్తుంటే వారు సైతం ఆందోళన బాట పడుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసినా ఆయా గ్రామాల్లో ఆడబిడ్డలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రాస్తారోకోలు చేస్తున్నారు. ఇలా రాష్ట్రంలో ఏ మూలన చూసినా ఏదో ఒక రూపంలో ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు పోలీసు యాక్టుల పేరుతో ఉక్కుపాదం మోపుతూ అక్రమంగా కేసులు పెడుతుండటం గమనార్హం.